

రహదారుల నిర్మాణం చేపట్టాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ఆచంట : తుపాన్ ప్రభావం వల్ల మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయని, తక్షణమే అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్ నుంచి ఆచంట సంత మార్కెట్‌కు వెళ్లే మినీ బైపాస్ రహదారిని తక్షణమే నిర్మాణం చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆచంట మార్టేరు ఆర్అండ్‌బి ప్రధాన రహదారి, కచేరి సెంటర్ నుంచి సంత మార్కెట్ వరకు, ఆచంట పోలీస్ స్టేషన్ నుంచి సంత మార్కెట్ వరకు మినీ బైపాస్ రోడ్డులు అధ్వానంగా మారాయన్నారు. ఈ రహదారులపై పెద్దపెద్ద గోతులతో వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మద్యం ఏరులు..!

గతంతో పోలిస్తే రెండు జిల్లాల్లో మద్యం అమ్మకాలు రెట్టింపు

విచ్చలవిడిగా బెల్టు షాపులు, అనధికార పర్మిట్ రూమ్‌లో ఇష్టానుసారంగా అమ్మకాలు

ఏడాదిలో 91 శాతం బీర్లు, 18 శాతం లిక్కర్ అమ్మకాలు

నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నా పట్టని ఎక్సైజ్ అధికారులు

మద్యం మత్తులో యువత భవిష్యత్తు చిత్తు



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు, అనధికార పర్మినెంట్ రూములు, నైట్ పాయింట్లు, డోర్ డెలివరీ వంటి సదుపాయాలతో రెయింబవళ్లు తాగిన వాళ్లకు తాగినంత పుష్కలంగా దొరుకుతుంది. గతంతో పోలిస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆధీనంలోని మద్యం అమ్మకాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీని తీసుకొచ్చారు. అయితే ఏడాది కాలంలోనే రెండు జిల్లాల్లో మద్యం అమ్మకాలు దాదాపు రెట్టింపయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 175 మద్యం దుకాణాలు, ఏలూరు జిల్లాలో 144 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో కలిపి కల్లుగీత కార్మికులకు అదనంగా సుమారు మరో 50 మద్యం దుకాణాల వరకూ ఉన్నాయి. జిల్లాలో రోజుకు సుమారు రూ.4 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతాయని అంచనా. ఏలూరు జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు నెలవారీ టార్గెట్లు విధిస్తోంది. అమ్మకాలపై 20 నుంచి 30 శాతం అమ్మకాలు పెంచాలని ఒత్తిడి తెస్తోంది. ఏదో విధంగా సేల్స్ పెంచుకునేందుకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. ఒక్కో షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకూ బెల్టులు నిర్వహిస్తున్నారు. షాపుల వద్దే మద్యం సేవించేందుకు టేబుళ్లు, కుర్చీలతో సిట్టింగ్ ఏర్పాట్లు, మంచింగ్ కోసం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, సోడా, డ్రింక్, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. లూజ్ సేల్స్, నైట్ పాయింట్లు పేరిట వేళాపాళా లేకుండా మద్యం అమ్మకాలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదు.

నిబంధనలకు పాతర.. భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు

గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో నిబంధనలు కచ్చితంగా అమలయ్యేవి. నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు జరిగేవి. షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకుపోవడమే తప్ప అక్కడ తాగే వీలుండేది కాదు. నాటి పరిస్థితికి పూర్తి భిన్నంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమ్మకాలు చేస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. అయితే ఇటు ప్రభుత్వం గానీ ఎక్సైజ్ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు కనిపించట్లేదు. ఎక్సైజ్ శాఖ తూతూ మంత్ర చర్యలతో చేతులు దులుపుకుంటోందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలతో పోలిస్తే ఈ ఏడాది కాలంలో మద్యం వినియోగం భారీగా పెరిగింది. గత ప్రభుత్వంలో 2023 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు నెలాఖరు నాటికి జిల్లాలో 15,63,135 లిక్కర్, 4.40,948 బీరు విక్రయాలు జరిగాయి. కూటమి పాలనలో 2024 అక్టోబరు నుంచి 2025 సెప్టెంబరు నెలాఖరు వరకూ 18,42,683 లిక్కర్, 8,40,648 కేసుల బీర్ల అమ్మకాలు జరగడం గమనార్హం. లిక్కర్ సేల్స్ 18 శాతం పెరగ్గా, బీర్లు వినియోగం దాదాపు రెట్టింపు కావడం విశేషం.

మద్యం మత్తులో యువత భవిష్యత్తు చిత్తు

మద్యం మత్తులో యువత జోగుతోంది. మద్యానికి బానిసై భవిష్యత్తు ఛిద్రమవుతున్న పరిస్థితి ఉంది. గతంతో పోలిస్తే అటు లిక్కర్ ఇటు బీర్ల అమ్మకాలు తారస్థాయికి చేరాయంటే దీనికి ప్రధాన కారణం యువతే. అన్ని వేళలా మద్యం అందుబాటులో ఉండడం, తాగేందుకు వేళాపాళా లేకపోవడంతో యువత మద్యం జోష్‌లోనే సాగుతోంది. బీర్లు తాగే వారిలో అధిక శాతం మంది యువతే. ఈ ఏడాది కాలంలో బీర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 91 శాతం పెరిగాయి. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడుతున్న వారిలో యువకులే అధికంగా ఉంటున్నారు. మద్యం మత్తులో జోగుతూ భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్నారు. ఇటీవల కాళ్ల మండలం ఎల్ఎన్.పురంలో చెరువుల వద్ద ఇద్దరు యువకులు కలిసి మద్యం సేవిస్తుండగా తలెత్తిన వివాదం ఒకరి నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. భీమవరంలో ఒక ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన వివాదంలో ఒకరికొకరు బ్లేడ్లతో దాడికి దిగడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఇలా చెప్పుకుంటూపోతే జిల్లాలో అనేక సంఘటనలు రోజువారీ జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం మద్యం అన్నివేళలా అందుబాటులో ఉండడమేనని తెలుస్తోంది. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పరిస్థితి. ఇటీవల జరిగిన ఘటనలే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు.

ఆర్థిక భరోసా సామాజిక పింఛన్లు

జిల్లాలో 2,25,639 మందికి రూ.97.72 కోట్ల సొమ్ము పంపిణీ


పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సామాజిక పింఛన్లు వృద్ధులకు, వితంతువులకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం 19వ వార్డు భీమేశ్వరస్వామి ఆలయం పక్క వీధిలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అభయ హస్తం, వికలాంగులు, కుష్టు వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, పెరాలసిస్ వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళలు, వితంతువులు, నేత కార్మికులు మొత్తం 246 మంది లబ్ధిదారులకు రూ.10.98 లక్షల నగదు పంపిణీ చేశారు. క్షేమ సమాచారాన్ని, ఆరోగ్య విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 రకాల పెన్షన్లకు సంబంధించి 2,25,639 మంది లబ్ధిదారులకు రూ.97.72 కోట్లు పంపిణీని చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి పింఛన్ అందజేయాలని, ఏవిధమైన ఫిర్యాదులూ లబ్ధిదారుల నుంచి అందకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఎపిఒ ఎం.శ్రీనివాసప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు, విఆర్ఒ జి.లక్ష్మీకుమారి, వెల్ఫేర్ సెక్రటరీ మంతెన ఉమా, శానిటేషన్ సెక్రటరీ యు.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరంలో బోటు షికార్

బివి రాజు వీరమ్మ పార్క్‌లో ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి


బోటు షికారు చేస్తున్న కలెక్టర్ నాగరాణి, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు బివి.రాజు వీరమ్మ పార్కులో ఏర్పాటు చేసిన బోటు షికారును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భవ్య భీమవరం పేరిట ఇప్పటికే పట్టణంలో పలు పార్కులు, కూడళ్ల అభివృద్ధి, ఫౌంటెన్స్, స్వాగత ద్వారాలు ఏర్పాటు, డివైడర్స్‌కు అందమైన పెయింటింగ్స్, పాత బస్టాండ్‌లో నూతన టెర్మినల్ నిర్మాణం, పట్టణంలో పలు బస్టాపుల నిర్మాణం, ప్రత్యేక లైటింగ్ వంటివి దాతల సహకారంతో ఏర్పాటు చేసి భీమవరం సుందరీకరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ వంటి పట్టణాల్లో మాత్రమే ఉన్న బోట్ షికార్‌ను బివి రాజు ఫౌండేషన్ సహకారంతో బివి రాజు పార్క్‌లో ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, పట్టణ ప్రజలు ఎంతో సంతోషించదగిన విషయమని తెలిపారు. పట్టణ ప్రజలకు ఇది ఒక ఆట విడుపులా ఉంటుందని తెలిపారు. పిల్లలు, పెద్దలు సెలవు రోజుల్లో ఆనందంగా గడపడానికి ఆహ్లాదకరమైన ప్రదేశాలు ఏమీ లేవని, దీని దృష్టిలో పెట్టుకొని దశలవారీగా పట్టణంలోని అన్ని పార్కులూ అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వివిధ షేపుల్లో ఉన్న నాలుగు రకాల బోట్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, వాటర్ రిక్షా రూ.50, నాలుగు సీటర్ బోటు రూ.30, రెండు సీటర్ బోటు రూ.50, అడ్వెంచర్ బోటు రూ.50 ఒక్కొక్కరూ బోటు షికారుకు రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ టి.త్రినాధరావు, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, డిఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి ఎ.అప్పారావు, బివి.రాజు కళాశాల కోఆర్డినేటర్ ఎం.రమేష్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ మంతెన రాంప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

సైక్లిస్టును ఢీకొట్టిన స్కూల్ విద్యార్థుల ఆటో

సైక్లిస్టుకు, విద్యార్థినికి తీవ్ర గాయాలు, మరికొంత మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - తణుకు

సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని స్కూలు పిల్లలను తీసుకెళ్లే ఆటో ఢీ కొట్టిన సంఘటనలో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తితో పాటు ఓ విద్యార్థిని తీవ్ర గాయాలయ్యాయి. మరికొంత మంది విద్యార్థులకు స్వల్ప గాయాలైన సంఘటన తణుకు మండలం తేతలి జాతీయ రహదరిపై శనివారం జరిగింది. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు పట్టణం బ్యాంకు కాలనీకి చెందిన గురజాడ విద్యానికేతన్ స్కూల్‌కు చెందిన ఆటో విద్యార్థులను స్కూల్‌కు తీసుకొస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిపారు. తణుకు మండలం ముద్దాపురం నుండి ఐదుగురు విద్యార్థులు, తేతలిలో నలుగురు మొత్తం తొమ్మిది మంది విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని తణుకు వస్తుండగా సైకిల్‌పై వెళ్తున్న గొర్రెల సత్యనారాయణను ఆటో ఢీకొట్టడంతో సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలోని పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు, పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆకాంక్షకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ మిద్దె వెంకన్న తణుకులోని గురజాడ విద్యానికేతన్ స్కూల్‌కు 3 సంవత్సరాలుగా ఆటోలో విద్యార్థులను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వెంకన్నకు పోలియో కావడంతో ఆటో అదుపు తప్పి సైకిల్‌పై వెళ్తున్న సత్యనారాయణ ఢీ కొట్టినట్లు తెలిపారు. తీవ్ర గాయాలైన వారిని మొదట తణుకు ప్రభుత్వాసుపత్రికి, తరువాత మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తణుకు రూరల్ పోలీసులు తెలిపారు.


గాయపడిన సైక్లిస్టు సత్యనారాయణ


గాయపడిన విద్యార్థిని ఆకాంక్ష

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

3న కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 3వ తేదీన కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నట్లు కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడిశెట్టి.రామాంజనేయులు, ఉదుర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కౌలురైతులు గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ, పంటనష్టం, బ్యాంకు రుణాలు వంటి ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులను దగా చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం తెచ్చిన కౌలుచట్టం వల్ల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు భూ యజమానులు అంగీకరించకుండా కౌలు రైతును కనీసం పంట నమోదు చేసుకోకుండా అడ్డుపడుతుంటే ప్రభుత్వానికి కనబడడం లేదన్నారు. తుపాను తీవ్రతకు కౌలు రైతులు పంట కోల్పోతే అధికారులు పంట నష్టాన్ని భూ యజమానుల పేరున నమోదు చేస్తున్నారని విమర్శించారు. తక్షణం ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరున పంట నమోదు చేసి, పంటనష్టం కౌలు రైతులకు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని, ప్రస్తుతం అమలవుతున్న కౌలుచట్టం రద్దు చేయాలని, కౌలురైతులందరికీ పంటరుణాలిచ్చి ఆదుకోవాలని పేర్కొన్నారు.

బాబూరావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

సంతాప సభలో పలువురు నేతలు


భీమవరంలో నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

కార్మిక నేత చింతకాయల బాబూరావు అకాల మృతి కార్మిక వర్గానికి తీవ్ర లోటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద శనివారం బాబూరావు చిత్రపటానికి కార్మికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ కార్మికుడిగా, రైస్‌మిల్లు డ్రైవర్‌గా సిఐటియు జెండా పట్టి అంచలంచెలుగా ఎదిగి పెద్ద నాయకునిగా గుర్తింపు పొందారని చెప్పారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, డి.నాగేశ్వరరావు, బజార్ లాగుడు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పులి అప్పన్న, కె.కృష్ణ, అప్పారావు, నానాజీ పాల్గొన్నారు.

తణుకు : చింతకాయల బాబూరావు పోరాట స్ఫూర్తితో కార్మికులు ముందుకు సాగాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక సివిల్ సప్లై, ఎస్‌డబ్ల్యుయుసి జట్టు కార్మికులు చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గార రంగారావు, ఎస్‌డబ్ల్యుయుసి జట్టు మేస్త్రి శీలబోయిన శ్రీనివాసరావు, కాంతారావు, ఏసు, లక్ష్మణ్, అప్పన్న, సూర్యనారాయణ, రమణ, శివ, పెంటయ్య, సుధాకర్, నూకరాజు పాల్గొన్నారు.

యలమంచిలి : సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం యలమంచిలి మండలం, చించినాడ అమరవీరుల స్మారక భవనంలో చింతకాయల బాబూరావు సంతాప సభ సిపిఎం మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన బాబూరావు అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి జిల్లా కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు అలుపెరగని ప్రజా పోరాటాలు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతగానో పరిశ్రమించారని, అటువంటి నాయకుని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ముందుగా బాబూరావు చిత్రపటానికి సిపిఎం సీనియర్ నేత బాతిరెడ్డి జార్జి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ, ఎస్.నాగమణి, ఎం.జయశ్రీ, పి.సుభద్ర, ఎస్.భాస్కరరావు, ఎస్.నాగేశ్వరావు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకట స్వామి, లూథర్ బాబు, కె.సత్యనారాయణ, టి.రామారావు, పాల్గొన్నారు.


ఆచంటలో నివాళి అర్పిస్తున్న అంగన్వాడీలు


యలమంచిలిలో..


గణపవరంలో..


తణుకులో..

ఆచంట : సిపిఎం సీనియర్ నాయకులు, చింతకాయల బాబూరావు అకాల మృతి కార్మిక ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు అన్నారు. శనివారం ఆచంటలో చింతకాయల బాబూరావు చిత్రపటానికి అంగన్వాడీ జిల్లా నాయకురాలు వైట్ల ఉషారాణి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, సత్యవతి, వెంకటలక్ష్మి, మంగాలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : కార్మికోద్యమానికి చింతకాయల బాబూరావు మృతి తీరని లోటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. బాబూరావు మృతికి మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో శనివారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్ కార్మికుడిగా పనిచేస్తూ కార్మిక నేతగా బాబూరావు ఎదిగారన్నారు. యడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, జి.పెద్దింట్లు, జి.దుర్గా ప్రసన్న, బజార్ జట్టు కార్మికులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు బహిష్కరిస్తున్నాం

ప్రధానోపాధ్యాయులకు వినతి

ప్రజాశక్తి - నరసాపురం

బోధనేతర పనులు బహిష్కరించాలని రాష్ట్ర ఫ్యాప్టో సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నరసాపురం మండల శాఖ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం ఆయా హాజరు వంటివి మాత్రమే ఆన్‌లైన్ చేస్తామన్నారు. అంతేగాని ఇతర పనులకు సంబంధించి ఆన్‌లైన్ తీసి అప్లోడ్ చేయమనడం సరికాదన్నారు. ఈ పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా మండలం లోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు మెమోరాండం అందించారు. సహకరించిన ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులందరికీ యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్‌కుమార్‌లు ఫ్యాప్టో పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు.


నరసాపురం: హెచ్ఎంకు వినతి అందజేస్తున్న ఉపాధ్యాయులు


వీరవాసరంలో..

వీరవాసరం : ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలు బహిష్కరిస్తూ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఫ్యాప్టో) ఆధ్వర్యాన శనివారం మండలంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మెమోరాండం అందజేశారు. మితిమీరిన బోధనేతర పనుల వల్ల బోధనా సమయం కుదించుకుపోతుందని, ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలను ఇప్పటికే ప్రభుత్వానికి పలు దఫాలుగా విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అక్టోబర్ 7న విజయవాడలో ధర్నాచౌక వద్ద నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో అక్టోబర్ 10వ తేదీ నుండి బోధనేతర పనులు బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఫ్యాప్టో నిర్ణయం మేరకు ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్నం భోజనం పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపట్టడం జరుగుతుందని, మూల్యాంకణ పరీక్షలు నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులు చేయబోమంటూ మెమోరాండంలో పేర్కొంటూ ఆయా పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెమోరాండంలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎన్.ప్రసాదుబాబు, ముద్రగళ శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు, డి.పుల్లారావు, కె.నాగమునేశ్వరావు, కె.సురేష్, వై.ఎరికేశ్వరావు, జి.పుల్లంరాజు, వీరవల్లి సత్యనారాయణ, వి.వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఆకివీడు : బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, శివాజీ, రమేష్, నాగేశ్వరరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఇస్మాయిల్, రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ టీచర్ అటెండెన్స్, స్టూడెంట్ అటెండెన్స్ వివరాలు మినహాయించి మిగిలిన ఏ ఆన్‌లైన్ పనులు చేయరాదని నిర్ణయించామని చెప్పారు. ముఖ్యంగా 'వీర గాథ, కౌశల్, మార్క్స్ ఎంట్రీ, పిఎంఎఫ్ ఇన్స్పెక్షన్'తో సహా పది అంశాలపై మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. అందుకు సంబంధించి పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. మండల విద్యాశాఖ అధికారికి పులవర్తి లక్ష్మణ స్వామి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధానోపాధ్యాయుడు పారనాయుడు, సరోజినీదేవి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాదేవి, మండలంలోని ఇతర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకి మెమోరాండం అందజేసినట్లు తెలిపారు.

దుర్గంధంలో వసతి గృహం


అస్తవ్యస్తమైన డ్రెయినేజీతో అవస్థలు

రోగాల బారిన పడతామేమోనని విద్యార్థుల భయాందోళన

ప్రజాశక్తి - ఉండి

ప్రజాశక్తి పరిశీలన

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ ఉండటంతో తాము అనారోగ్యాల బారిన పడతామేమోనని ఉండి ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహ విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. వసతిగృహంలో సుమారు 25 మంది విద్యార్థులు ఉండగా వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సమకూర్చినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉందని విద్యార్థులు తెలుపుతున్నారు. కలెక్టర్ పర్యటించిన తర్వాత వసతి గృహంలోని సమస్యలు పరిష్కారమయ్యాయని, కానీ డ్రెయినేజీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని, ఈ సమస్యను కూడా పరిష్కరించాలని వారు కోరుతున్నారు. రెగ్యులర్ వార్డెన్ బదిలీ కావడంతో ఇక్కడ భీమవరం నుంచి ఇన్‌ఛార్జి వార్డెన్ నాగ మోహన్ ఉదయం పూట ఉంటారని, సాయంత్రం వేళ ఉండకపోవడంతో మిగిలిన సిబ్బంది అందుబాటులో ఉంటారని విద్యార్థులు తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోతుందని, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరించాలని సిబ్బంది తెలిపారు. తమ వసతి గృహాల్లో సుమారు 40 మంది విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఎవరైనా కళాశాల విద్యార్థులు చేరాలంటే వార్డెన్‌ను సంప్రదించాలని సిబ్బంది తెలిపారు.


బాలుర వసతి గృహంలో నిలిచిన మురుగునీరు

పెన్షన్ల పంపిణీలో అంగన్వాడీలు

ఉండి : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పించన్ల పంపిణీలో సచివాలయ సిబ్బందిని మాత్రమే నియమించగా నవంబర్ నెల పెన్షన్ పంపిణీలో అంగన్వాడీలను సైతం నియమించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అంగన్వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించే పనిలో అంగన్వాడీలు ఇప్పటి వరకు ఉండగా ఇటీవల కాలంలో వారిపై పని భారాన్ని మోపి, యాప్‌ల పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం నేడు పించన్ల పంపిణీలో కూడా వారిని భాగస్వామ్యం చేయడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు.

పేదలకు నిత్యావసరాలు అందజేత

భీమవరం టౌన్ : భీమవరం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గొల్లగాని రమేష్ ఆధ్వర్యాన స్థానిక పట్టణ 28వ వార్డులోని పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ స్థానిక వార్డులోని పేదలకు, వికలాంగులకు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గొలగాని రమేష్ నేతృత్వంలో 25 కేజీల బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషకరమని, రమేష్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, కార్పొరేషన్ డైరెక్టర్లు పామర్తి వెంకటరామయ్య, ఎమ్‌డీ షబీనా, భీమేశ్వర దేవస్థాన ఛైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, టిడిపి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంకులో ఖాతాదారుల అవగాహనా సదస్సు

నరసాపురం : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నరసాపురం బ్రాంచిలో నాబార్డ్ వారి సౌజన్యంతో శనివారం ఖాతాదారుల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ పిబి.శ్రావణి మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న రూపే డెబిట్ కార్డు, మొబైల్ బ్యాంకింగ్, పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై ఇన్సూరెన్స్ పథకాల ప్రయోజనాలు వివరించారు. కొంతమంది ఖాతాదారులను బ్యాంక్ మేనేజర్, బ్యాంక్ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సినీగాయకుడు రాజు మృతి బాధాకరం : ఆర్‌డిఒ

నరసాపురం: గుండెపోటుతో మృతిచెందిన సినీ గాయకుడు గోగులమండ రాజు పార్థీవ దేహం శుక్రవారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. రాజు మృతదేహన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆర్‌డిఒ దాసిరాజు, వైఎన్ కళాశాల యాజమాన్యంతో పాటు గ్రామానికి చెందిన పలువురు పార్థీవదేహాన్ని సందర్శించారు. పేద కుటుంబంలో పుట్టి ఉన్నత స్థితికి వెళ్లిన రాజు చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ఆర్‌డిఒ అవేదన వ్యక్తం చేశారు.

సీతారామయ్యకు సత్కారం

పాలకొల్లు రూరల్ : మండలంలోని వాలమర్రు సొసైటీలో 38 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలంగా సెక్రటరీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గంటా సీతారామయ్య(మోహన్)ను సొసైటీ చైర్మన్ ఉద్దరాజు రామకృష్ణంరాజు శనివారం రాత్రి జరిగిన సన్మాన సభలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు మాట్లాడుతూ 38 సంవత్సరాల పాటు రైతులకు సేవలు అందించి రైతుల మన్ననలను పొందారని కొనియాడారు. కార్యక్రమంలో పర్సన్స్ పూతినీడి చింతారావు, కొత్తలంక లక్ష్మీనారాయణ, సిబ్బంది బండారు శ్రీనివాస్, కొప్పుల వెంకట సత్యనారాయణ మూర్తి, కట్టా వెంకటేశ్వరరావు పాల్గొని సత్కరించారు.

4న స్కూల్ గేమ్స్ ఎంపికలు

వీరవాసరం: ఈనెల 4వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్-14, 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్, నెట్ బాల్ ఎంపికలు జరుగుతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శులు కె.అలివేలు మంగ, డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ బాల్ ఎంపికలు పెదవేగి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో, నెట్ బాల్ ఎంపికలు పాలకోడేరు మండలం గొరగనమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు సెల్ నెం.8074153923ను సంప్రదించాలని తెలియజేశారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వీరవాసరం: ఈనెల 2వ తేదీన కొల్లా భాస్కరమ్మ, శ్రీవీరరాఘవులు మోమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వీరవాసరంలో సంబంధిత ట్రస్ట్ హాస్పటల్ వద్ద రాజవల్లి రాధారమణ్ లయన్స్ కంటి ఆసుపత్రి పాలకొల్లు వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వివిధ కంటి జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేసి ఉచితంగా ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా ప్రశాంత్ పుట్టినరోజు

భీమవరం టౌన్ : కల్మషం లేని వ్యక్తి, సౌమ్యుడు, స్నేహశీలి, అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి ప్రశాంత్ అని పలువురు వక్తలు అన్నారు. భీమవరం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శనివారం కూటమి నాయకుల ఆధ్వర్యాన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ అంజిబాబు కుమారుడు పులపర్తి వెంకట ప్రశాంత్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. చిరుకూరి రామకృష్ణ చౌదరి, చల్లా రాము, కొప్పినీడి బాబి మాట్లాడుతూ క్రీడా రంగంలో కూడా ప్రశాంత్ ఉన్నతస్థాయికి చేరుకోవాలని, మరెన్నో పదవులను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి శివకృష్ణ, యర్రంశెట్టి లక్ష్మణ్, బొండాడ నాగ భూషణం, కుంపల చంద్రశేఖర్, అల్లూరి చిరంజీవి రాజు, కమల్, ఎం.శివ, నాగేంద్ర, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా రాజేష్

పోడూరు : వైసిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా రావిపాడు గ్రామానికి చెందిన దేవ రాజేష్ నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు నుంచి శనివారం ఉత్తర్వులు అందినట్లు రాజేష్ పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాస్థాయిలో పదవిని ఇవ్వడం పట్ల పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజుకు, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపికి దేవ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచండి

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. డిఎస్‌సి 2025 నూతన ఉపాధ్యాయులు 29 మంది శనివారం మర్యాదపూర్వకంగా ఎంఎల్ఎను కలిశారు. ఉపాధ్యాయులకు ఎంఎల్ఎ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు వి.హనుమ, పిఎంకె జ్యోతి, ఉప విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు.

శుద్ధ జలాలతో అనారోగ్యాలకు చెక్

ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు

ఉండి: మైక్రో వాటర్ ఫిల్టర్ల ద్వారా అందించే శుద్ధ జలాల వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం ఉండి మండలం చినపుల్లేరు గ్రామంలో మైక్రో వాటర్ ఫిల్టర్, సీసీ రోడ్, తాడి చెరువు రేవుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచిలు వేగేశ్న సోమరాజు, వేగేశ్న కృష్ణంరాజు, రంప సౌలురాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు బుద్ధరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నిత్యావసరాలు అందజేత

తణుకు : ఇటీవల మొంథా తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తుపాన్ ప్రభావంతో ఇబ్బందులు పడిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఇరగవరం మండలంలోని 250 కుటుంబాలకు పది కిలోల బియ్యంతోపాటు నిత్యావసరాలను శనివారం ఎంఎల్ఎ రాధాకృష్ణ పంపిణీ చేశారు.

ఉండి: తుపాను వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతూ పునరావాస కేంద్రంలో ఉన్న 26 కుటుంబాలకు శనివారం ఉండి మండలాధికారులు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ కావడి నాగార్జున మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉప తహశీల్దార్ కూనపరాజు సూర్యనారాయణ రాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.గొల్ల పాల్గొన్నారు.

నరసాపురం: తుపాను బాధితులను ఆదుకుంటామని విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. తుపాన్ ప్రభావంతో తీవ్ర నష్టాన్ని చవిచూసిన మండలంలోని వేములదీవి ఈస్ట్, చిన్నమైనవానిలంక, వేములదీవి వెస్ట్ గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను అందించారు. ఎంఎల్ఎతో పాటుగా మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు.

మురుగు పారదు.. చింత తీరదు..!

- ఏలూరుపాడులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థం
- తీవ్ర దుర్గంధంతో ప్రజల అవస్థలు
- సిమెంటు తూరలు ఏర్పాటు చేయాలని వేడుకోలు


చినపేట ఊర చెరువు చుట్టూ వదిలేసిన సిమెంట్ తూరలు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామపంచాయతీల పదవీకాలం ముగిసేలోగా మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల పనులు అయ్యేటట్లు కనిపించడం లేదు. డ్రెయినేజీ నీరు వెళ్లేలా సిమెంట్ తూరల ఏర్పాటు పనులు జరిగేనా..? అనే సందేహాలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ఏలూరుపాడు మేజర్ గ్రామ పంచాయతీలో చినపేట ఊర చెరువు వద్ద మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుంది. మురుగు నీరు వెళ్లేలా గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన ఆరునెలల క్రితం సిమెంట్ తూరలను చినపేట ఊర చెరువు వద్ద వదిలేశారు. నాణ్యత లేని తూరలు కావడంతో పగిలిపోయాయి. చినపేట చెరువు చుట్టూ వాటిని వదిలేశారు. ఈ డ్రెయినేజీ కాలువల గుండా మురుగునీరు ప్రవహించే మార్గం లేక డ్రెయినేజీ కాలువ నుంచి వెదజల్లే దుర్గంధం కారణంగా ఎప్పుడు, ఎలాంటి రోగాల బారిన పడాల్సి వస్తుందోనని ఆ ప్రాంతవాసులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అక్కడ నివసించే ప్రజలు ఇళ్లముందు కాలువల్లో మురుగు నీరు ఉన్నప్పటికీ తమ తలరాతలు ఇంతేనని గడుపుతూ వస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతుండటంతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దాడి చేస్తుండటంతో మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధుల బారిన పడతామేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిండి దోమల వ్యాప్తి వృద్ధి చెందుతుంది. ఈ అస్తవ్యస్త డ్రెయినేజీ కారణంగా స్థానికులు ప్రతిరోజూ మురుగు నీటి మధ్య సహజీవనం సాగిస్తున్నారు. దీంతో రోగాలకు గురవుతున్న పరిస్థితులు దాపరిస్తున్నాయి. అధికారులు మాత్రం ఇలాంటి వాటిపై ఏమాత్రం దృష్టిపెట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందడానికి ఈ ఘటనే నిదర్శనం. ఈ విషయంపై కార్యదర్శి ఎస్.అరుణాదేవిని వివరణ కోరగా వర్షాకాలం కావడంతో పనులు చేసేందుకు ఆటంకం ఏర్పడిందన్నారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం



మద్దాల భాగ్యలక్ష్మి, చినపేట, ఏలూరుపాడు

మురుగుకాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకెళ్లడం లేదు. మా ఇంటి వద్ద డ్రెయినేజీ నీరు నిలిచి పోతుంది. దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలి.

సిమెంట్ తూరలను ఏర్పాటు చేయాలి



గూడపాటి యాకోబు, చినపేట, ఏలూరుపాడు

డ్రెయినేజీల్లో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు ఉత్పత్తితో రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. దోమల వల్ల విషజ్వరాల బారిన పడుతున్నాం. అయినా గ్రామాధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించడం లేదు. మురుగునీరు నిల్వ ఉండకుండా మురుగు బోదెలోకి వెళ్లేలా సిమెంట్ తూరలను ఏర్పాటుచేసే చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు సంకల్పం

డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు

కాళ్ల : ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే తమ సంకల్పమని డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కోపల్లె గ్రామంలో శ్రీమంతెన దుర్గరాజు రాజయమ్మ హైస్కూల్ 74 సంవత్సరాల చరిత్ర గల పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభయాన్ నిధులు, మన బడి-మన భవిష్యత్తు ఫేజ్-2లో కోటి 17 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఎనిమిది అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జక్కరం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1, 2 డి.శ్రీనివాసరావు, పాలా యేసుదాస్, ఎంపిడిఒ జి.స్వాతి, ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మలా దేవి, సర్పంచి బూడి నాగమణి, ఉప సర్పంచి పర్రాలు, మంతెన రామ్‌కుమార్ రాజు, డాక్టర్ రామకృష్ణంరాజు, కోపల్లె సొసైటీ ఛైర్మన్ నంద్యాల రామరాజు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కొత్తపల్లి బంగారాజు, వేగేశ్నరామరాజు, ఎఇ ఎం.రమేష్, టిడిపి మండల అధ్యక్షులు తాతాపండు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

బిర్సా ముండా ఉద్యమాలు స్ఫూర్తిదాయకం : డిఆర్‌ఒ

భీమవరం : ఆదివాసీల సమస్యలపై బిర్సాముండా చేసిన ఉద్యమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జన జాతీయ గౌరవ దివాస్ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి, గిరిజన స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజానీకాన్ని చైతన్యం చేసి పోరాడిన గొప్ప యోధుడు బిర్సాముండా అన్నారు. గిరిజన సంక్షేమ శాఖాధికారి బి.పుష్పరాణి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎస్‌వి.అరుణకుమారి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఎవి.సూరిబాబు, గిరిజన నాయకులు బండి రాజేష్, జానీ అప్పలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యాపరంగా రాణించాలి : ప్రిన్సిపల్

గణపవరం : విద్యార్థులు విద్యాపరంగా రాణించాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. కాలేజీలో విద్యార్థులకు జరుగుతున్న ఇండక్షన్ కార్యక్రమం శనివారం ముగిసిన సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇండక్షన్ ప్రోగ్రాం వల్ల విద్యార్థులలో ఉన్న టాలెంట్‌ని గుర్తించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కాలేజీలో ఉన్న వనరులను ఉపయోగించుకొని అన్నిరంగాల్లో ఎదగటానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు రన్నింగ్, వ్యాసరచన, వక్తృత్వ, కవితారచనలు, డ్రాయింగ్, క్విజ్ వంటి పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. సమావేశంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, లెక్చరర్లు కెవి.గణేష్ కుమార్, శ్రీనివాసరావు, సిహెచ్.చైతన్య పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్లచిన వీరభద్రరావు

తణుకు : భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉద్యమించడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బళ్లచిన వీరభద్రరావు అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) సమావేశం స్థానిక పార్వతి దేవి ఆలయ ప్రాంగణంలో యర్రా మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముందుగా ఇటీవల మృతిచెందిన కార్మిక ఉద్యమ నేత చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 14 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బళ్ల చిన వీరభద్రరావు, అధ్యక్షులుగా వాటాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సోరపల్లి రామకృష్ణ, కార్యదర్శిగా అల్లాడి నాగ బలరాం, సహాయ కార్యదర్శిగా లంకే దుర్గారావు, కోశాధికారిగా బొక్క బాలాజీ రావు, సభ్యులుగా యర్రా మల్లికార్జున రావు, ఆనందం, గంగాధర్ రావు, తిరునాథం వెంకటేశ్వరరావు, యాతం పెద్దరాజు, తాళ్ల సత్యనారాయణ, వాసా వెంకట సుబ్బారావు, దొంతంశెట్టి ముకుంద్రరావు పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

పెనుమంట్ర : తుపాను కారణంగా తీవ్రంగా పంట నష్టపోయిన కౌలు రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కౌలు రైతు సంఘం సభ్యులు కూసంపూడి సుబ్బరాజు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన మండలంలోని జుత్తిగ గ్రామంలో ఇటీవల సంభవించిన తుపాన్ సందర్భంగా వరి పొలాల్లో ఆయన రైతులతో కలసి పర్యటించారు. సుమారుగా ఎకరానికి 20 నుంచి 25 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పర్సంటేజ్ ప్రకారం కాకుండా క్షుణ్ణంగా పరిశీలించి ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు కూసంపూడి సుబ్బరాజుతో పాటు గుత్తుల వెంకటేశ్వర్లు, కౌలు రైతులు పాల్గొన్నారు.

డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

తాడేపల్లిగూడెం : డిసెంబర్ 13వ తేదీన తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన అన్ని రకాల కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ పాల్గొన్నారు.

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, కక్షిదారులకు తక్కువ సమయంలో సమ న్యాయం అందించుటలో పోలీస్ అధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి అన్నారు. శనివారం కోర్ట్ హాల్‌లో నరసాపురం, పాలకొల్లు కోర్టులకు సంబంధించిన పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నరసాపురం బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్యప్రకాశరావు, పాలకొల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ప్రసాద్, నరసాపురం, పాలకొల్లు పట్టణ సిఐలు బి.యాదగిరి, కె.రజినీకుమార్, నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు, న్యాయమూర్తులు జి.గంగరాజు, ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పెనుమంట్ర : మండలంలోని పొలమూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలను నరసాపురం డివిజన్ ఉప విద్యాధికారి డి.మురళీ శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. బోధన మాధ్యమాలను, బోధన కృత్యాలను, బోధన పద్ధతులను, వాటిని పిల్లలకు బోధించే తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతలో అంశాలను పుస్తకాల్లో నమోదు చేయాలని సూచించారు.

పొట్టి శ్రీరాములు సంకల్ప బలం గొప్పది

పలుచోట్ల రాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆంధ్రుల కోసం ప్రత్యేక రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు సంకల్ప బలం గొప్పదని మానవత సంస్థ జిల్లా కమిటీ ప్రతినిధి, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మార్టేరు సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్త సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరామలు త్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం అన్నారు. మానవత మండల అధ్యక్షులు శిరం విశ్వనాథం, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి(సిఎస్ఆర్), పూర్వ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, పడాల రామచంద్రారెడ్డి, పలువురు మానవత సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం పాఠశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కిలారి రవిబాబు, వెల్లంకి నరేష్, కోశాధికారి కెఎస్ఎస్.మూర్తి, కె.వినాయక, ఎంఎల్ఎస్ఎస్.నారాయణ, పి.నాగకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగొండ : అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలదండ వేసి సర్పంచి నక్కా శ్యామల సోనీ శాస్త్రి నివాళి అర్పించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన చేసిన సేవల గురించి వివరించారు.


గుండెపోటుతో సిపిఎం నేత శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి - ఆచంట



ఆచంట పంచాయతీ పరిధి చింతల తోట గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు, సిపిఎం నాయకులు దేవాబత్తుల శ్రీనివాసరావు(50) శనివారం ఉదయం గుండెపోటుతో అకాల మృతి చెందారు. ఆయనకు భార్య జ్యోతి, ఒక కుమారుడు, కుమార్తె కలరు. శ్రీనివాసరావు ఆకాల మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు, నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, బండి రంగారావు, నెక్కంటి కృష్ణమూర్తి శ్రీనివాసరావు భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, దేవాబత్తుల బాబురావు, దేవాబత్తుల రాధాకృష్ణ, నాగరాజు, సామ్యూల్ తదితరులు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భార్య జ్యోతి ఉపాధి నిమిత్తం ఇతర దేశంలో ఉన్న నేపథ్యంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

సిపిఎం సీనియర్ నేత కాశీ విశ్వేశ్వరరావు మృతి



ఆచంట : సిపిఎం సీనియర్ నాయకులు, ఆచంట గ్రామానికి చెందిన మాజీ టౌన్ కార్యదర్శి చేకూరి కాశీ విశ్వేశ్వరరావు(80) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయనకు భార్య కుమారుడు, కుమార్తె కలరు. ఈయన ఆచంట గ్రామంలో ఉద్దరాజు రామం, అల్లూరి సత్యనారాయణ రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్ఎస్), దిగుపాటి ప్రకాష్ రావు, దిగుపాటి సాల్మన్ రాజు నాయకత్వంలో పనిచేశారు. ఈయన హయాంలో ఆచంట గ్రామం బలమైన కమ్యూనిస్టు ఉద్యమానికి కేంద్రంగా ఉండేది. కొంతమంది సొంత ప్రయోజనాలు, అధికార పదవులకు లోనై వర్గ సంకరణ రాజకీయాలకు పాల్పడగా కాశీ విశ్వేశ్వరరావు పేద ప్రజల కోసం పనిచేసే పార్టీ అని నమ్మి ఏ పార్టీలోకి మారకుండా తుది శ్వాస విడిచే వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం సిపిఎంకు కట్టుబడి నిలబడిన నాయకుడని పలువురు కొనియాడారు. ఆయన మృతి పట్ల మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, నెక్కంటి కృష్ణమూర్తి, కుసుమే జయరాజు, బండి రంగారావు, ఎస్‌విఎన్.శర్మ, తోటపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వరి చేల పరిశీలన

ఉండి: తుపాను ప్రభావంతో నేలకొరిగిన వరి చేలను మండల వ్యవసాయాధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 350 ఎకరాలలో వరి పంట నష్టం వాటిల్లిందని, పారదర్శకంగా పంట నష్టాన్ని నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి కరణం పరంజ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి : సిపిఎం

పాలకొల్లు : తుపానుకు అన్ని చేతివృత్తులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు ప్రకారం ప్రజలందరికీ బియ్యం, పామాయిల్ ఇతర నిత్యావసరాలు ఇవ్వాలని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ కోరారు. పాలకొల్లు సిపిఎం కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల భారీ వర్షాలకు పంటలతో పాటు రోడ్లు, డ్రెయినేజీ, గృహాలు బాగా దెబ్బతిన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం బాధితులను విరివిగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన వరద సహాయంను బహిరంగ పరచాలన్నారు. సిపిఎం నేతలు జవ్వాది శ్రీనివాస్, సోమేశ్వరరావు, యర్రా అజయ్ పాల్గొన్నారు.